రంగనాథస్వామి ఆలయంలో పూజలు



డిప్యూటీ సీఎం సతీమణి నందినిని ఆశీర్వదిస్తున్న అర్చకులు బద్రీనాథచర్యులు

జియాగూడ: జియాగూడ రంగనాథ స్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని కుటుంబసభ్యులతో దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక బృందం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నందని, కుటుంబసభ్యులకు తీర్థ ప్రసాదాలు అందిచి ఆలయ ప్రతినిధి శేషాచారి బద్రీనాథచార్యులు, రంగనాథచార్యులు వేద మంత్రాలతో వారిని ఆశీర్వదించారు.

అభినందనలు



చాంద్రాయణగుట్ట: నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి కరాటేలో సత్తా చాటారు. జహనుమాలోని మోంట్‌ఫోర్ట్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అక్షిత్ నాయక్ 19వ ఓపెన్ జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లలో పాల్గొని స్పైరింగ్‌లో గోల్డ్‌మెడల్, కటాస్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఎడ్వార్డ్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్, నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ మాస్టర్ గణేష్ నాయక్ లు విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు.

నియామకం



పాశం రాజేందర్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కె.ప్రసాద్

నాంపల్లి: జాతీయ వెనుకబడిన తరగతుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాశం రాజేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.కె. ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌యాదవ్ మాట్లాడుతూ..వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతానని పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కె.ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉమా మహేశ్వర్, సుదర్శన్, నర్సింగ్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్ ఫ్లోర్ మిల్ వద్ద గల కోవెల రంగనాయక స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం విజయవంతంగా ముగించిన సందర్భంగా చండీ ఉపాసకులు అభినందన్ నివేది ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. సుంకరి శాలిని ప్రేమ్‌కిషోర్ పూజా కార్యక్రమాలను నిర్వహించగా ఎస్.జనార్దన్, ఎం.నర్సింహ పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

గోల్కొండ: ఈ నెల 9వ తేదీ నుంచి దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శి దేవర వంశీ తెలిపారు. దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ పేరిట ఈ టోర్నమెంట్‌ను గుడిమల్కాపూర్‌లోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వివరాలు, పేర్ల నమోదు కోసం 99081 10529లో సంప్రదించవచ్చునని ఆయన సూచించారు. పాల్గొనే క్రీడాకారుల వయస్సు 25 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్‌కు అన్ని వర్గాల ప్రజల ఆదరణ ఉందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నాన్‌దేడ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మన పార్టీ బరిలో అభ్యర్థులను నిలిపిందన్నారు. పోటీ చేస్తున్న 16 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయించామన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఎస్‌ఏ ఖాన్ తదితరులున్నారు.

యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలి

గోల్కొండ: యువత వ్యాపారం వైపు దృష్టి సారించాలని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం ఆయన అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో షేక్‌పేట్, డివిజన్‌కు చెందిన యువజన సంఘాల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి కల్పన విషయంలో ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. యువత వ్యాపార రంగం వైపు దృష్టిసారిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఇస్మాయిల్, యూసుఫ్, పూర్ణచందర్ తదితరులున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



దరియాబాగ్ నుంచి మేకలమండి దారిలో పారుతున్న మురుగు

జియాగూడ: జియాగూడలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. దరియాబాగ్ నుంచి కమేళా రోడ్డు కేసరి హనుమాన్ 2జీ బస్ స్టాండ్ రోడ్డుపై డ్రైనేజీ మురుగు ఏరులై పారుతోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డులో కంకరే హనుమాన్, కేసరి హనుమాన్, మసీదులున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు మాత్రం మురును సమస్యను పట్టించుకోవడం లేదు. అలాగే చెత్త కుప్పలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తరలించక పోవడంతో సత్యనారాయణకాలనీ, కార్గిల్‌నగర్ వాసులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు మురుగు సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు.

వాణిజ్య పన్నుల శాఖలో ప్రమోషన్ల లొల్లి

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ శాఖలో ప్రమోషన్ల లొల్లి కొనసాగుతుంది. కొన్ని నెలల క్రితం డీపీసీ (డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ) పలు విభాగాల అధికారులకు చట్టరీత్య ప్రమోషన్లు ఇచ్చినా ఉన్నతాధికారులు అమలు చేయకపోవడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. అంతేకాక పలు విభాగాల్లో కొన్ని ఏళ్లుగా ప్రమోషన్లు లేక ఎదురుచూస్తున్న వందలాది మంది జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అసిస్టెంట్ కమిషనర్లను డిప్యూటీ కమిషనర్లుగా, డిప్యూటీ కమిషనర్లను జాయింట్ కమిషనర్లుగా, జాయింట్ కమిషనర్లను అడిషనల్ కమిషనర్లుగా ప్రమోషన్లు ఇస్తూ డీపీసీ ఆదేశాలు జారీ చేసింది. కానీ ప్రమోషన్లు పొందిన ఈ అధికారులు అంతా ఉన్నత పదవులకు వెళ్లడం లేదు. తమ కుర్చీలకు అంటుకొని అదే స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. డీపీసీ నిబంధనలకు వ్యతిరేకంగా కొంత మంది అధికారులు ప్రమోషన్లు పొంది కూడా తమ తమ స్థానాలను వదలకపోవడంతో వాణిజ్య పన్నుల శాఖ పలు కార్యాలయాల్లో తీవ్ర చర్చ కొనసాగుతుంది. వీరితో పాటు డీసీటీఓ

డీపీసీ ప్రమోషన్లు ఇచ్చినా అమలు చేయని ఉన్నతాధికారులు

లను సీటీఓలుగా, సీటీఓలను అసిస్టెంట్ కమిషనర్లుగా, అసిస్టెంట్ కమిషనర్లను డిప్యూటీ కమిషనర్లుగా డీపీసీ ప్రమోషన్లు ఇచ్చింది. వీరు మాత్రం తమ ప్రమోషన్లు పొంది చట్టప్రకారం విధులు నిర్వహిస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ల ఆవేదన..

దాదాపు 300 మందికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు రావాల్సి ఉండగా కేవలం 150 మందికి మాత్రమే పోస్టులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం 300 మందికి పోస్టులు కేటాయిస్తే మిగతా 150 మందికి ఎలా పోస్టింగ్‌లు ఇస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇస్తే కొత్తగా చేరే 300 మందికి న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు. వీరందరికీ వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతే కాక కొంతమంది సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు ఇవ్వకుండానే ఇన్‌చార్జి ఏసీటీఓలుగా బాధ్యతలు అప్పజెపుతూ ఉన్నతాధికారులు వారిచే పనులు చేయిస్తున్నారు. వారందరికీ



వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయం

ఏసీటీఓలుగా ప్రమోషన్లు ఇస్తే జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు ఎంతో న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

ఏడేళ్లుగా సీటీఓ ఒకే ప్రాంతంలో..

ఏడేళ్లుగా ఒక సీటీఓ (అసిస్టెంట్ కమిషనర్) పాతుకుపోయి విధులు నిర్వహిస్తుండడంతో పలువురు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్ట ప్రకారం ఎవరైనా అధికారి 2 నుంచి 3 ఏళ్ల సమయం ముగిసిన వెంటనే బదిలీలు ఉంటాయి. ఆ అధికారికి మాత్రం బదిలీ కావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారి బదిలీ అయినా ఉన్నతాధికారి ప్రమేయంతో అదే ప్రాంతంలో కొనసాగుతున్నాడు. ఏ ప్రాంతంలో లేని విధంగా ఒకే సర్కిల్‌లో ఏడేళ్లుగా ఒక అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి పనిచేస్తుండడంతో పలు వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయాల్లో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే డివిజన్‌లో ఏళ్ల కొద్ది..

పలు వాణిజ్య పన్నుల శాఖ డివిజన్లలో దాదాపు 20 ఏళ్ల క్రితం జూనియర్ అసిస్టెంట్లుగా నియమితులైన కొంత మంది అధికారులు సీనియర్లు అసిస్టెంట్లుగా, ఏసీటీఓలుగా ప్రమోషన్లు పొందినప్పటికీ అదే డివిజన్‌లో విధులు నిర్వహిస్తుండడంతో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. 20 ఏళ్లు దాటినా ప్రమోషన్లు పొంది కూడా ఒకే డివిజన్‌లో ఎలా పనిచేస్తారని కొంత మంది అధికారులు, కొంత మంది ఉద్యోగులు ఉన్నతాధికారులను ప్రశ్నిస్తున్నారు. వాణిజ్యపన్నుల నిబంధనల ప్రకారం..రెండు లేదా మూడేళ్లకు బదిలీలు చేయాలని పలువురు పేర్కొంటున్నారు.

రెగ్యులర్ కమిషనర్ ఇంకెప్పుడు..

రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పన్నుల శాఖకు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో ఆర్థిక ఆదాయం తగ్గిపోతుంది. ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న తాధికారి రెండు శాఖలకు న్యాయం చేయలేకపోతున్నారు. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో వాణిజ్యపన్నుల శాఖ ఆదాయం తగ్గిపోతుందని పలువురు పేర్కొంటున్నారు. ఒకే ఉన్నతాధికారి వాణిజ్య పన్నుల శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా, సెక్రెటరియేట్‌లో మరో శాఖ ఉన్నతాధికారిగా కొనసాగుతుండడంతో వాణిజ్య పన్నుల శాఖలో ఆదాయం తగ్గిపోతుందని పలువురు పేర్కొంటున్నారు.

అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కల్యాణ్ నాయక్

చాంద్రాయణగుట్ట: దేశానికి సుస్థిర పాలన ఇస్తున్న బీజేపీ వైపు అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్ నాయక్ అన్నారు. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేయడంలో భాగంగా గిరిజన మోర్చా ఆధ్వర్యంలో బండ్లగూడలోని ఎస్టీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వికసిత్ భారత్ నిర్మాణంలో పాలు పంచుకోవడానికి పెద్ద ఎత్తున గిరిజన యువకులు బీజేపీ సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, జిల్లా ఇన్‌చార్జి రూపావత్ మహేష్ నాయక్, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి, ఐటీ సెల్ కన్వీనర్ విశాల్ నాయక్ పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జగన్నాథరావు

నాంపల్లి: భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని జిల్లా భూగర్భ జలశాఖ అధికారి జగన్నాథరావు అన్నారు. హైదరాబాద్ జిల్లాలోని భూగర్భ జల శాఖ, సీడ్‌స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నేషనల్ హైడ్రోలజీ ప్రాజెక్ట్ ద్వారా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేనందున నగర ప్రజలు కురిసిన ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్యామూల్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మచారి, జియాలజిస్ట్ సంధ్య, హైడ్రోజిస్ట్ వాసు, సూపరింటెండెంట్ అంజయ్య, హెచ్‌ఎం శాంతా రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జానకీరామ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

గౌలిపురా: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి, సీనియర్ క్రీడాకారుడు బుజ్జం జానకీరామ్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గౌలిపురాలోని ఆయన నివాసంలో జానకీరామ్ కుటుంబాన్ని, ఆయన కుమారుడు బి.సాయి కిరణ్‌ను రైతుల రుణ ఉపశమన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు ఇ.వి.సతీష్ కుమార్, రామ్ కోటి ఉన్నారు.

అలరించిన 'అర్ధనారీశ్వరం'



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హిరణ్మయ్ నృత్యవళి అకాడమి ఆధ్వర్యంలో నృత్య నాట్య గురువు ప్రియాంక భరడే శిష్య బృందం అర్ధనారీశ్వరం పేరిట గురువారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. అల్లంపూర్, కాశి, తుల్జాపూర్, మధురై, శివశక్తి క్షేత్ర పురాణాల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..శాస్త్రీయ సంగీత నృత్య కళలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కూచిపూడి నృత్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబు, వక్త అమిగంట్ర, ఫేజ్–3 ఈవెంట్ సీఈఓ విష్ణేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చెత్తను తరలించండి



శాలిబండ: శాలిబండ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని ఖాజీపురా, సల్మాన్ జిమ్ తదితర ప్రాంతాల్లో చెత్తాచెదారాలను పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో పేరుకుపోయి రోడ్లపైకి వస్తుంది. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తరలించే విధంగా తగిన చర్యలు తీసుకొని ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నారు.

15న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



ముస్తాబైన ఆలయం

చార్మినార్: కార్తీక మాసం సందర్భంగా ఈనెల 15న మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. రాబోయే శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు జరిగే ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించే ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీ ప్రతినిధులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. పూజల్లో భాగంగా ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి మహాభిషేకం, అలంకారం, శ్రీ చక్రార్చన, స్వామివారికి రుద్రాభిషేకం, ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకు పూజ, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నాంపల్లి కోళ్ల మార్కెట్‌లో ఘర్షణ

– ఒకరికి తీవ్ర గాయాలు

నాంపల్లి: కోళ్ల మార్కెట్‌లో బుధవారం రాత్రి ఇద్దరు కోళ్ల వ్యాపారస్తుల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలలైన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి కోళ్ల మార్కెట్‌లో వ్యాపారం చేసే గౌస్ చికెన్ సెంటర్ నిర్వాహకుడు వాహెద్, పక్కనే ఉండే మరో చికెన్ సెంటర్ నిర్వాహకుడు వాజిద్ ఖాన్ చిన్న విషయానికి గొడవ పడ్డారు. ఈ ఘర్షణ కాస్త ముదరడంతో గౌస్‌తో పాటు అతడి అనుచరులు వాజిద్ ఖాన్ దుకాణంపై దాడి చేశారు. ఈ దాడిలో వాజిద్ ఖాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వాజిద్ ఖాన్‌ను ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులు హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



లంగర్‌హౌస్: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్నవారికి మిఠాయిలు తినిపించి, రోజా పువ్వులు అందించి ధన్యవాదాలు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన దాదాపు 120 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంట్లో తమ కోసం వేచిచూసే కుటుంబీకులను దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాలన్నారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

లాకర్‌లో బంగారం మాయం..?

లంగర్‌హౌస్: బ్యాంకు లాకర్‌లో దాచిన తన బంగారం మాయమైందని ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు తెలిపిన మేరకు.. లంగర్ హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాదర్‌బాగ్‌లో నివాసముండే మొహమూద్ నానల్‌నగర్ వద్ద ఉన్న ఇండియన్ బ్యాంకులో జనవరి 30న లాకర్‌లో 35 తులాల బంగారు నగలు పెట్టానని చెబుతున్నాడు. అనంతరం సౌదీ వెళ్లిపోయిన అతను గత నెలలో తిరిగి వచ్చాడు. ఈ నెల 5న బ్యాంకుకు వెళ్లి లాకర్ తెరవగా అందులో బంగారం కనిపించలేదని చెబుతున్నాడు. ఈ విషయంపై పోలీసులు బ్యాంకు అధికారులను అడగ్గా లాకర్‌లో ఏమి దాచుకున్నారనే వివరాలు తాము సేకరించకూడదని తెలిపారు. తాము కేవలం లాకర్‌ను అద్దెకు ఇస్తామని, కాని ఆ తాళం చెవి లేకుండా వేరొకరు లాకర్ తెరిచే అవకాశం లేదని తేల్చి చెప్పారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామని పోలీసులు చెబుతున్నారు.

ఒత్తిడిని జయించి లక్ష్యాన్ని సాధించాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

చార్మినార్: ఒత్తిడిని జయించి లక్ష్యాన్ని సాధించాలని ప్రముఖ సైకాలజిస్ట్ డా.లక్ష్మణ్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల సోషల్ సైన్సెస్ విభాగాలు, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన 'వ్యక్తిత్వ వికాసం–ఒత్తిడి నిర్వహణ' అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు, యువత చాలా చిన్న, చిన్న విషయాలకే ఒత్తిడికి లోనవుతూ ఉత్తమ ఫలితాలు సాధించలేకపోతున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బాల భాస్కర్ మాట్లాడుతూ..విద్యార్థులకు ఇలాంటి సదస్సుల ద్వారా చిన్నచిన్న అంశాలకు డిప్రెషన్‌కు గురికాకుండా మనోధైర్యంతో విద్యపైన దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. నీరజ, డా.శంకర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.ఐజాజ్ సుల్తానా, డా.కృష్ణవేణి, డా.కోటేశ్వరరావు, లతా రాణి, డా.తిరుపతి, డా.అవినాష్, డా. లక్ష్మీనారాయణ, డా. భూపాల్, అనిల్, డా. మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఏఎంఎస్ విధానంతో వాటర్‌బోర్డుకు భారీ నష్టం



వాటర్‌బోర్డు ఈడీకి వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఏఎంఎస్ విధానంతో వాటర్‌బోర్డుకు కోట్లాది రూపాయాల నష్టం వాటిల్లుతుందని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్ బోర్డు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఏఎంఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్‌కు ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానం ద్వారా ఒక్కో సెక్షన్‌కు రూ.50 లక్షలు కేటాయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఓపెన్ టెండర్ ద్వారా రూ.25 లక్షలు కేటాయిస్తే పనులు చేస్తామన్నారు. వెంటనే ఏఎంఎస్ విధానంపై విజిలెన్స్, ఏసీపీ విచారణ జరిపితే ఎన్నికోట్ల రూపాయల అవినీతి జరుగుతుందో అర్థమవుతుందన్నారు. మస్తాఫా, మహ్మద్ ఇర్ఫాన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



అబిడ్స్: గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో కార్తీక మాసం వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. గురువారం తెల్లవారు జాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

మందకృష్ణ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ



చాంద్రాయణగుట్ట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే వర్గీకరణ జరుగుతుందని ఎమ్మార్పీఎస్ పాత నగర ఇన్‌చార్జి ఎస్.ఎం.నర్సింహా స్వామి మాదిగ అన్నారు. ఖైరతాబాద్‌లో జరిగిన మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సుకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.